సంచలన దినపత్రిక
హంస కలం వార్త
PRGI :T/TG/2026/0126/4786/1242

రిపోర్టర్లు కావలెను
9346255044
9966555449

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్,సంపుటి :01,సంచిక :44,చీఫ్ ఎడిటర్ : వడ్ల మధుసూదన్ చారి,వెల రూ. 4/-, ఆదివారం 01-03-2026

# జలమండలికి శారదా పీఠం భూముల కేటాయింపు

## సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

- పీఠానికి కేటాయించిన భూముల్లో జలమండలి నిర్మాణ పనులు చేపట్టవద్దని ఆదేశం
- జలమండలికి పీఠం భూముల కేటాయింపు తక్షణమే రద్దు చేయాలన్న ముఖ్యమంత్రి
- జలమండలి నిర్మాణ పనులపై ముఖ్యమంత్రి అసహనం



కోకాపేటలోని శారదా పీఠానికి కేటాయించిన భూమికి సంబంధించి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. శారదా పీఠానికి కేటాయించిన ఈ భూముల్లో జలమండలి నిర్మాణ పనులు చేపట్టవద్దని ఆదేశించారు. జలమండలికి శారదా పీఠం భూముల కేటాయింపు తక్షణమే రద్దు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శారదా పీఠం భూములను జలమండలికి కేటాయించడంతో అక్కడ నిర్మాణ పనులు చేపట్టారు. జలమండలి నిర్మాణ పనులను శారదా పీఠం ప్రతినిధులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకురాగా, అధికారులపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. పీఠం భూములను జలమండలికి కేటాయించిన సమయంలో అక్కడి నిర్మాణాల స్థితిని తెలియజేయకపోవడాన్ని ప్రశ్నించారు. జలమండలికి ఈ భూకేటాయింపులను రద్దు చేసి, శారదా పీఠానికే ఆ భూములు కొనసాగేలా ఆదేశించారు. శానిటేషన్ నుంచి ఫుడ్ సేఫ్టీ వరకు.. స్ట్రీట్ లైట్స్ నుంచి వాటర్ హార్వెస్టింగ్ వరకు - మిగతా 2 లో

## శుభపరిణామం రేవంత్ రెడ్డి నిర్ణయంపై హరీశ్ రావు ప్రశంసలు



- శారదాపీఠంకు కేటాయించిన భూములు పీఠానికే చెందేలా సీఎం ఆదేశాలు
- ముఖ్యమంత్రి ఆదేశాలు శుభపరిణామమన్న ముఖ్యమంత్రి
- రేవంత్ రెడ్డికి అమ్మారు ఇప్పటికైనా సరైన బుద్ధి ప్రసాదించారన్న హరీశ్ రావు

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న ఒక నిర్ణయంపై బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు హర్షం వ్యక్తం చేశారు. కోకాపేటలోని శారదాపీఠంకు కేటాయించిన భూములను తిరిగి పీఠానికే కొనసాగించాలని ఆదేశాలు ఇవ్వడంపై హరీశ్ రావు స్పందించారు. ముఖ్యమంత్రి ఆదేశాలు శుభపరిణామమని అన్నారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. కోకాపేటలో శారదా పీఠం భూములను జలమండలికి కేటాయించిన నిర్ణయాన్ని రద్దు చేయడం రాజ శ్యామలాదేవి అమ్మవారి కృపతో జరిగిన ధర్మ విజయమని, ఇది భక్తుల విజయమని పేర్కొన్నారు. ఆ అమ్మవారు ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సరైన బుద్ధి ప్రసాదించారని అన్నారు. అదే సమయంలో, ఎలాంటి స్పష్టమైన ప్రజాప్రయోజన ప్రతిపాదిక లేకుండా పర్యావరణ నియమ నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ - మిగతా 2 లో

## ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయెల్ దాడులు



- తన వైఖరి వెల్లడించిన భారత్
- ఇరాన్, గల్ఫ్ పరిణామాలపై స్పందించిన భారత విదేశాంగ శాఖ
- అన్ని పక్షాలు సంయమనం పాటించాలని భారత్ విజ్ఞప్తి
- ఇరాన్, ఖతార్, యూఏఈలోని భారతీయులకు ఎంబసీల హెచ్చరికలు
- అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని సూచన
- ఇరాన్‌పై భారీ దాడులు చేస్తున్నామన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్

ఇరాన్, గల్ఫ్ ప్రాంతంలో శనివారం చోటుచేసుకున్న తాజా పరిణామాలపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో తన వైఖరి వెల్లడించింది. ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో అన్ని పక్షాలు సంయమనం పాటించాలని, పరిస్థితులు మరింత దిగజారకుండా చూడాలని భారత్ కోరింది. - మిగతా 2 లో

## కాకినాడ ఘటన దురదృష్టకరమన్న ప్రధాని మోదీ

- కాకినాడ జిల్లా బాణసంచా పేలుడుపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి... రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటన
- బాధితుల కుటుంబాలకు అండగా ఉంటామని వెల్లడి
- గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున సాయం ప్రకటన
- బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి



ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జిల్లాలో చోటుచేసుకున్న ఘోర ప్రమాదంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఓ బాణసంచా తయారీ కర్మాగారంలో ప్రమాదవశాత్తు జరిగిన పేలుడు ఘటనలో ప్రాణనష్టం సంభవించడం పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను ఎంతగానో కలచివేసిందని పేర్కొన్నారు. ఈ మేరకు ప్రధాని మోదీ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. "కాకినాడ జిల్లాలోని బాణసంచా కర్మాగారంలో ప్రమాదవశాత్తు జరిగిన పేలుడులో ప్రాణనష్టం సంభవించడం - మిగతా 2 లో



## రన్ వేపై కంకర రాళ్లు కూడా గుర్తించినట్లు ఏఏఐబీ నివేదిక

- అజిత్ పవార్ మృతి... బారామతి విమాన ప్రమాద కారణాలపై ప్రాథమిక నివేదిక
- బారామతిలో విజిబిలిటీ తక్కువగా ఉందని ఏఏఐబీ ప్రాథమిక నివేదిక వెల్లడి
- రన్ వేపై మార్కింగులు మసకబారినట్లు వెల్లడించిన నివేదిక

బారామతి విమాన ప్రమాద దర్ఘటనపై విమాన ప్రమాదాల దర్యాప్తు బ్యూరో (ఏఏఐబీ) ప్రాథమిక నివేదికను విడుదల చేసింది. నెల రోజుల క్రితం జరిగిన - మిగతా 2 లో


## మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ

- ఈ కష్ట సమయంలో వారితో ఉండటం నా కర్తవ్యంగా భావించాను: సీఎం చంద్రబాబు
- కాకినాడ జిల్లా వేట్లపాలెం బాణసంచా ప్రమాద బాధితులకు సీఎం భరోసా
- విజయనగరం పర్యటనలో ఉండగానే కాకినాడకు వెళ్లిన చంద్రబాబు
- ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు పరామర్శ



కాకినాడ జిల్లా వేట్లపాలెంలో సంభవించిన బాణసంచా పేలుడు ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను, గాయపడిన వారిని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా పరామర్శించారు. శనివారం ఆయన బాధితులను ఓదార్చి, వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వాస్తవానికి సీఎం చంద్రబాబు విజయనగరం జిల్లా పర్యటనలో ఉన్నారు. అయితే పేలుడు ఘటన తీవ్రత గురించి సమాచారం అందగానే, తన షెడ్యూల్ - మిగతా 2 లో

## ఆంధ్ర యూనివర్సిటీకి పూర్వవైభవం తీసుకువస్తాం



- మంత్రి నారా లోకేశ్
- ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాలపై మంత్రి లోకేష్ సమీక్ష
- ఏయూని ప్రపంచస్థాయిలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా మార్చడమే లక్ష్యం
- మార్చి 26 నుంచి ఏప్రిల్ 26 వరకు పూర్వ విద్యార్థులతో వేడుకలు
- యూనివర్సిటీ వందేళ్ల విజన్‌కు యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ఆదేశం

చారిత్రక నేపథ్యం కలిగిన ఆంధ్ర యూనివర్సిటీకి (ఏయూ) పూర్వవైభవం తీసుకువచ్చే దిశగా కృషి చేస్తున్నామని - మిగతా 2 లో

## వేట్లపాలెంలో విస్ఫోటనం తీవ్ర దిగ్భ్రాంతికరం



పవన్ కల్యాణ్

- మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపిన పవన్ కల్యాణ్
- బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్న ఉప ముఖ్యమంత్రి
- పేలుళ్లకు కారణాలపై విచారణ జరుపుతున్నట్లు వెల్లడి

కాకినాడ జిల్లాలో బాణసంచా పరిశ్రమలో పేలుడు జరిగి 21 మంది మరణించిన ఘటనపై ఆంధ్రప్రదేశ్ - మిగతా 2 లో

# జలమండలికి శారదా పీఠం భూముల కేటాయింపు

తేడా వస్తే ఊరుకునేదీలేదుః సీఎం రేవంత్ తెలంగాణలో పట్టణాభివృద్ధికి మరింత వేగం.. కోర్ అర్బన్ రీజియన్‌లో సమగ్ర మార్పుల దిశగా అడుగులు.. అర్బన్ డెవలప్‌మెంట్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పెషల్ ఫోకస్ పెట్టారు. సచివాలయంలో మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో కీలక సమీక్ష నిర్వహించారు. పారిశుద్ధ్యం నుంచి ఫుడ్ సేఫ్టీ వరకు.. స్ట్రీట్ లైట్స్ నుంచి వాటర్ హార్వెస్టింగ్ వరకు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. శానిటేషన్ నుంచి ఫుడ్ సేఫ్టీ వరకు.. స్ట్రీట్ లైట్స్ నుంచి వాటర్ హార్వెస్టింగ్ వరకు తేడా వస్తే ఊరుకునేదీలేదుః సీఎం రేవంత్ తెలంగాణలో పట్టణాభివృద్ధికి మరింత వేగం.. కోర్ అర్బన్ రీజియన్‌లో సమగ్ర మార్పుల దిశగా అడుగులు.. అర్బన్ డెవలప్‌మెంట్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పెషల్ ఫోకస్ పెట్టారు. సచివాలయంలో మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో కీలక సమీక్ష నిర్వహించారు. పారిశుద్ధ్యం నుంచి ఫుడ్ సేఫ్టీ వరకు.. స్ట్రీట్ లైట్స్ నుంచి వాటర్ హార్వెస్టింగ్ వరకు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. తెలంగాణ పట్టణాల అభివృద్ధి విషయంలో అధికారులు వేగం పెంచాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అర్బన్ ఏరియాల డెవలప్‌మెంట్‌కు సంబంధించి సచివాలయంలో మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి.. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో చేపట్టాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతోపాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా... తెలంగాణలోని నగరాల్లో శానిటేషన్, దోమల నివారణపై అధికారుల ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇందులో భాగంగా.. మున్సిపల్ అధికారులు గుర్తించిన ప్రదేశాల్లోనే చెత్త వేసేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. పనులు ఆలస్యం కాకుండా అవసరమైతే టెక్నాలజీ వినియోగించాలని, సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కారం జరిగేలా డ్యాష్‌బోర్డ్ వ్యవస్థను బలోపేతం చేయాలని ఆదేశించారు. కోర్ అర్బన్ రీజియన్‌లోని అన్ని స్ట్రీట్ లైట్లకు ప్రత్యేక నంబర్లు కేటాయించి కమాండ్ కంట్రోల్ సిస్టమ్‌తో అనుసంధానం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

**అన్ని హోటల్స్ కిచెన్లలో సీసీ కెమెరాలు, జజజకి లింక్..!**

మరోవైపు.. జఖ=జు పరిధిలో ఫుడ్ సేఫ్టీకి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు సీఎం రేవంత్‌రెడ్డి. నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార నాణ్యత పర్యవేక్షణను పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. హోటళ్ల కిచెన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేయాలని ఆదేశించారు. తరచూ తనిఖీలు నిర్వహించడంతో పాటు ప్రత్యేక మానిటరింగ్ వింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. హోటళ్లకు రేటింగ్, సర్టిఫికేషన్ విధానాన్ని పరిశీలించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. వాణిజ్య సముదాయాలు, వ్యాపార సముదాయాల్లో ఫైర్ సేఫ్టీ నిబంధనల అమలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా.. ఫైర్ సేఫ్టీ విషయంలో అడ్వాన్స్‌డ్ ఎక్విప్‌మెంట్ వినియోగించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అలాగే.. హైదరాబాద్ నగరంలోని సిగ్నల్ జంక్షన్లు, సర్కిల్స్ దగ్గర వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ ఏర్పాటు చేసి వర్షపు నీటిని సంరక్షించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముందుగా కొన్ని ప్రాంతాలను గుర్తించి పైలట్ ప్రాజెక్ట్‌గా అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు తెలిపారు. మొత్తంగా.. తెలంగాణలోని పట్టణాల అభివృద్ధిపై రేవంత్ సర్కార్ ప్రత్యేకంగా దృష్టి సారిస్తోంది. నగరాల అభివృద్ధిలో పారదర్శకత, టెక్నాలజీ వినియోగం, ప్రజా ఆరోగ్యమే ప్రధాన లక్ష్యంగా ముందుకెళ్తోంది.

# శుభపరిణామం రేవంత్ రెడ్డి నిర్ణయంపై హరీశ్ రావు ప్రశంసలు

ఖజానాకు తూట్లు పొడుస్తూ నామినేషన్ పద్ధతిలో మీ అల్లుడి అనుయాయులకి హెచ్‌ఎండీఏ ద్వారా కేటాయించిన 17 ఎకరాల భూమి సంగతి ఏమిటని హరీశ్ రావు ముఖ్యమంత్రిని నిలదీశారు. ఆ భూమిలో కొనసాగుతున్న క్రషర్ యూనిట్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రయోజనాలకు వ్యతిరేకంగా తీసుకునే రేవంత్ రెడ్డి ప్రభుత్వం చర్యలపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని హెచ్చరించారు.

# రన్ వేపై కంకర రాళ్లు కూడా గుర్తించినట్లు ఏఏఐబీ నివేదిక

ఈ ప్రమాదంలో మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఎన్సీపీ అధినేత అజిత్ పవార్ సహా ఐదుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. ప్రమాదం జరిగిన సమయంలో బారామతిలో విజిబిలిటీ తక్కువగా ఉందని, రన్‌వేపై మార్కింగులు మసకబారాయని నివేదిక పేర్కొంది. అక్కడ కంకర కూడా ఉన్నట్లు గుర్తించింది. ఈ క్రమంలో అనియంత్రిత ఎయిర్ ఫీల్డులు భద్రతా ప్రమాణాలు పాటించేలా సంబంధిత వర్గాలకు డీజీసీఏ సూచనలు చేయాలని ఏఏఐబీ సిఫార్సు చేసింది. ఆరోజు కంట్రోల్ టవర్‌ను ఎఫ్‌టీవోలోని ఓ గ్రౌండ్ ఇన్‌స్ట్రక్టర్ నడిపించారని, ల్యాండింగ్ సమయంలో పైలట్లతో కమ్యూనికేట్ చేశారని నివేదికలో ఏఏఐబీ పేర్కొంది. విమానం రన్ వేను సమీపిస్తున్న సమయంలో పైలట్లు విజిబిలిటీ గురించి ఆరా తీశారని తెలిపింది. 3,000 మీటర్లుగా ఉందని టవర్ నుంచి సమాధానం వచ్చిందని పేర్కొంది. ఆ తర్వాత ల్యాండింగ్‌కు క్లియరెన్స్ వచ్చిందని, అయితే వీఎఫ్ఆర్ ఆధారిత విమానానికి ల్యాండింగ్ కోసం కనిష్ఠంగా 5,000 మీటర్ల విజిబిలిటీ అవసరమని పేర్కొంది. ప్రమాద సమయంలో ఇది తక్కువగా ఉందని తెలిపింది. రన్ వే రీకార్పెటింగ్ పనులు కూడా చివరిసారి 2016లో చేశారని, దీనితో మార్కింగ్స్ మసకబారినట్లు పేర్కొంది. రన్ వేపై కంకర రాళ్లు కూడా గుర్తించినట్లు తెలిపింది. బారామతి విమాన ప్రమాద ఘటనలో కాక్ పిట్ వాయిస్ రికార్డర్ ధ్వంసమైందని, ఈ క్రమంలో నేషనల్ ట్రాన్స్ పోర్టు సేఫ్టీ బోర్డు సాయంతో సాలిడ్ స్టేట్ కాక్‌పిట్ వాయిస్ రికార్డర్ నుంచి డేటాను డౌన్ లోడ్ చేస్తామని, దానిని విశ్లేషిస్తామని ఏఏఐబీ తెలిపింది. ప్రమాదానికి దారితీసిన మూల కారణాలు, వాస్తవాలు వంటివి వెలికితీసేందుకు పూర్తిస్థాయి దర్యాప్తు కొనసాగుతోందని స్పష్టం చేసింది.

# మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ

ఈ కష్ట సమయంలో వారితో ఉండటం నా కర్తవ్యంగా భావించాను: సీఎం చంద్రబాబు మార్చుకుని వెంటనే కాకినాడకు బయలుదేరారు. వేట్లపాలెం వద్ద సంఘటన స్థలాన్ని పరిశీలించి, అనంతరం సామర్లకోట ఆసుపత్రిలో, కాకినాడ జీజీహెచ్ లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. అనంతరం ఈ పర్యటనపై స్పందిస్తూ చంద్రబాబు ఉద్వేగభరితమైన ట్వీట్ చేశారు. "బాధితులకు ధైర్యం చెప్పాను. జరిగిన విషాదం మరచిపోలేనిది.. కలిగిన నష్టం భర్తీ చేయలేనిది" అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతటి కష్ట సమయంలో బాధితులతో ఉండటం తన కర్తవ్యంగా భావించానని పేర్కొన్నారు. శోకసంద్రంలో ఉన్న మృతుల కుటుంబాలకు ధైర్యం చెప్పానని, ప్రభుత్వ పరంగా అందించాల్సిన సాయం కచ్చితంగా అందిస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. వేట్లపాలెం బాధితులకు అండగా ప్రభుత్వం.. భారీ పరిహారం ప్రకటించిన సీఎం చంద్రబాబు.. వేట్లపాలెం ప్రమాద స్థలాన్ని పరిశీలించిన సీఎం చంద్రబాబు నాయుడు, మృతుల కుటుంబాలకు రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని ఆయన తెలిపారు. అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నలుగురు అధికారులపై సస్పెన్షన్ వేటు వేస్తూ, దోషుల ఆస్తులు జప్తు చేస్తామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన వేట్లపాలెం ఘటన అత్యంత దురదృష్టకరమని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈ ఘోర ప్రమాద స్థలాన్ని పరిశీలించిన సీఎం, బాధితుల కుటుంబాలను పరామర్శించి.. వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ దుర్ఘటనలో ఇప్పటివరకు 21 మంది మృతి చెందగా, మరో 9 మంది పరిస్థితి విషమంగా ఉందని ముఖ్యమంత్రి వెల్లడించారు. ప్రమాద తీవ్రతకు కారణమైన పరిస్థితులను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు.

**బాధిత కుటుంబాలకు భారీ పరిహారం**

ప్రభుత్వం బాధితుల కుటుంబాలకు అండగా నిలుస్తుందని సీఎం చంద్రబాబు ప్రకటించారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.20 లక్షల చొప్పున పరిహారం అందజేస్తామని ప్రకటించారు. మృతుల కుటుంబాల్లోని పిల్లల చదువు బాధ్యతను ప్రభుత్వమే తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఇళ్లు కోల్పోయిన లేదా ఇళ్లు లేని బాధితులకు కొత్త ఇళ్లు కేటాయిస్తామని వెల్లడించారు.

**అధికారులపై వేటు.. దోషులకు కఠిన శిక్ష**

ఈ ఘటనపై విచారణ జరుపుతామని సీఎం స్పష్టం చేశారు. ప్రమాదానికి గల కారణాలను విశ్లేషించిన ఆయన, అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన నలుగురు అధికారులను సస్పెండ్ చేసినట్లు సీఎం ప్రకటించారు. ఘటనకు కారణమైన దోషుల ఆస్తులను జప్తు చేసి, వారికి జీవిత ఖైదు పడేలా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. "సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగింది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన చర్యలు తీసుకుంటాం" అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయెల్ దాడులు

ముఖ్యంగా పౌరుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని భారత విదేశాంగ శాఖ విజ్ఞప్తి చేసింది. సమస్యల పరిష్కారానికి చర్చలు, దౌత్య మార్గాలే శరణ్యమని విదేశాంగ శాఖ పేర్కొంది. "ఉద్రిక్తతలు తగ్గించేందుకు చర్చల ద్వారా ముందుకెళ్లాలి. అన్ని దేశాల సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతను అందరూ గౌరవించాలి" అని ఒక అధికారిక ప్రకటనలో స్పష్టం చేసింది. ఆయా ప్రాంతాల్లోని భారతీయ పౌరులతో తమ దౌత్య కార్యాలయాలు నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాయని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. మరోవైపు టెహ్రాన్, దోహా (ఖతార్), అబుదాబి (యూఏఈ)లోని భారత రాయబార కార్యాలయాలు అక్కడి భారతీయులకు అత్యవసర అడ్వైజరీలు జారీ చేశాయి. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా ఇరాన్‌లోని భారతీయులు అనవసర ప్రయాణాలు మానుకోవాలని, సాధ్యమైనంత వరకు ఇళ్లలోనే ఉండాలని టెహ్రాన్ ఎంబసీ సూచించింది. అలాగే ఖతార్, యూఏఈలోని భారతీయులు కూడా అప్రమత్తంగా ఉండాలని, సైనిక స్థావరాలకు దూరంగా ఉంటూ స్థానిక అధికారుల ఆదేశాలను పాటించాలని అక్కడి ఎంబసీలు కోరాయి. ఏవైనా అత్యవసర పరిస్థితులు తలెత్తితే ఎంబసీలను సంప్రదించాలని హెల్ప్‌లైన్ నంబర్లను వెల్లడించాయి. ఇరాన్ క్షిపణి వ్యవస్థను పూర్తిగా ధ్వంసం చేసే లక్ష్యంతో అమెరికా దళాలు భారీ దాడులు చేస్తున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించిన నేపథ్యంలో ఈ ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. ఈ క్రమంలో గల్ఫ్ దేశాల్లో ఉన్న భారతీయుల భద్రతపై భారత ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.

# ఆంధ్ర యూనివర్సిటీకి పూర్వవైభవం తీసుకువస్తాం

రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఏయూ శతాబ్ది ఉత్సవాలను చరిత్రలో నిలిచిపోయేలా, కనీవినీ ఎరుగని రీతిలో అత్యంత ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. విశాఖపట్నంలో ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల నిర్వహణపై వర్సిటీ వైస్ ఛాన్స్ లర్ (వీసీ) ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్, ఇతర ఉన్నతాధికారులతో మంత్రి లోకేశ్ విస్తృత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఆంధ్ర యూనివర్సిటీకి దశాబ్దాల ఘన చరిత్ర ఉందని గుర్తుచేశారు. ఈ యూనివర్సిటీని ప్రపంచంలోనే మేటి విద్యాసంస్థగా, 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'గా తీర్చిదిద్దేందుకు ఈ శతాబ్ది ఉత్సవాలు ఒక వేదికగా నిలవాలని ఆకాంక్షించారు. మార్చి 26 నుంచి ఏప్రిల్ 26వ తేదీ వరకు నెల రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవాల్లో పూర్వ విద్యార్థులను (అల్యూమిని) విస్తృతంగా భాగస్వాములను చేయాలని సూచించారు. వారి అనుభవాలు, విజయాలు ప్రస్తుత తరానికి స్ఫూర్తినిచ్చేలా కార్యక్రమాలు రూపొందించాలన్నారు. శతాబ్ది ఉత్సవాల్లో ఏయూ ఘన చరిత్ర ప్రతిబింబించేలా అన్ని చర్యలు తీసుకోవాలని, దీనికోసం నియమించిన వివిధ కమిటీల మధ్య సమన్వయం ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. మీడియా పబ్లిసిటీకి అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు, ప్రస్తుత విద్యార్థులతో కళలు, సంగీతం, సాహిత్యం వంటి సాంస్కృతిక కార్యక్రమాలను వినూత్నంగా రూపొందించాలని చెప్పారు. ఈ ప్రక్రియలో విద్యార్థుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలన్నారు. కేవలం యూనివర్సిటీకే పరిమితం కాకుండా, ఉత్తరాంధ్ర ప్రజలను, విద్యార్థులను కూడా ఈ వేడుకల్లో భాగస్వాములను చేయాలని లోకేష్ దిశానిర్దేశం చేశారు. ప్రముఖులతో వివిధ అంశాలపై ప్రత్యేక సదస్సులు నిర్వహించడంతో పాటు, యూనివర్సిటీ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రాబోయే వందేళ్ల విజన్‌కు తగిన 'యాక్షన్ ప్లాన్'ను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో భాగంగా వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్ మాట్లాడుతూ, శతాబ్ది ఉత్సవాల సందర్భంగా వర్సిటీలో చేపట్టబోయే అభివృద్ధి పనులు, ఏప్రిల్ 26న జరిగే శతాబ్ది స్థాపన దినోత్సవ అజెండాను మంత్రికి వివరించారు. అనుబంధ కళాశాలలను కూడా ఉత్సవాల్లో కలుపుకుని వెళతామని తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న స్థానిక ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ, యూనివర్సిటీతో అనుబంధం ఉన్న ప్రతి ఒక్కరినీ ఉత్సవాల్లో భాగం చేయాలని, దీనిద్వారా విశ్వవిద్యాలయానికి మంచి గుర్తింపు (విజిబిలిటీ) తీసుకురావాలని సూచించారు. శతాబ్ది ఉత్సవాల నిర్వహణ ఒక అద్భుత అవకాశమని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని అభిప్రాయపడ్డారు. ఈ సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, గంటా శ్రీనివాసరావు, పీజీవీఆర్ నాయుడు (గణబాబు), విష్ణుకుమార్ రాజు, వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావుతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వేట్లపాలెంలో విస్ఫోటనం తీవ్ర దిగ్భ్రాంతికరం



పవన్ కల్యాణ్ ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వేట్లపాలెం వద్ద జరిగిన ఈ పేలుడు ఘటనలో పలువురు మృతి చెందారని తెలిసి ఆవేదనకు గురయ్యానని, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని ఆయన పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. ఈ దుర్ఘటన గురించి తెలియగానే జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ఘటన వివరాలు తెలుసుకున్నట్లు పవన్ కల్యాణ్ వెల్లడించారు. కలెక్టర్, ఎస్పీ ఘటన స్థలంలో ఉండి పరిస్థితిని, సహాయక చర్యలను పర్యవేక్షిస్తూ, క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం కాకినాడకు తరలించే ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. బాణాసంచా తయారీ పరిశ్రమ వద్ద ఇంకా పేలుళు చోటుచేసుకుంటున్నట్టు అధికారులు తెలియజేశారని, పేలుళ్లకు కారణాలపై విచారణ ప్రారంభించినట్లు తెలిపారు. బాణాసంచా పరిశ్రమలపై అధికారులు ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలని, భద్రత చర్యలను తనిఖీ చేయాలని జిల్లా అధికారులకు ఆదేశించినట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. పరిసర గ్రామాలకు పొగ అలుముకున్న క్రమంలో ఆయా గ్రామాల ప్రజలకి ధైర్యం చెప్పి, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. సహాయక చర్యల పర్యవేక్షణ కోసం, బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పడానికి మంత్రి కందుల దుర్గేశ్, ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌లను ఘటనాస్థలానికి పంపించినట్లు తెలిపారు.

# కాకినాడ ఘటన దురదృష్టకరమన్న ప్రధాని మోదీ

చాలా బాధాకరం. ఈ క్లిష్ట సమయంలో బాధిత ప్రజలు మరియు వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను" అని ప్రధాని పేర్కొన్నారు. అలాగే ఈ ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. బాధిత కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం తరఫున ఆర్థిక సాయాన్ని కూడా ప్రధాని ప్రకటించారు. ఈ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి రూ.2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించనున్నట్లు వెల్లడించారు. అలాగే ప్రమాదంలో గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు ప్రధాని తెలిపారు. జమ్మూకశ్మీర్ రంజీ విజయంపై ప్రధాని మోదీ ప్రశంసలు తొలిసారి రంజీ ట్రోఫీ గెలుచుకుని చరిత్ర సృష్టించిన జమ్మూకశ్మీర్ జట్టు పట్టుదల క్రమశిక్షణ అద్భుతమన్న ప్రధాని మోదీ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం ఆధారంగా కర్ణాటకపై విజయం శుభమ్ పుండిర్ ఆకిబ్ నబీ దార్ అద్భుత ప్రదర్శన జమ్మూకశ్మీర్ క్రికెట్ జట్టు తొలిసారి రంజీ ట్రోఫీ టైటిల్‌ను కైవసం చేసుకుని చరిత్ర సృష్టించింది. రంజీ ట్రోఫీ 2025-26 సీజన్ విజేతగా నిలిచిన జమ్మూకశ్మీర్ జట్టుపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. ఈ విజయం ఆ ప్రాంత ప్రజలకు గర్వకారణమని, జట్టు పట్టుదల, క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తికి ఇది నిదర్శనమని ప్రధాని పేర్కొన్నారు. ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. "తొలిసారి రంజీ ట్రోఫీ గెలుచుకున్న జమ్మూకశ్మీర్ జట్టుకు అభినందనలు. ఈ చారిత్రక విజయం అక్కడ పెరుగుతున్న క్రీడా ప్రతిభను చాటిచెబుతోంది. ఈ గెలుపు ఎందరో యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తుందని ఆశిస్తున్నాను" అని తెలిపారు. హుబ్లీ క్రికెట్ మైదానంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఎనిమిది సార్లు ఛాంపియన్‌గా నిలిచిన బలమైన కర్ణాటక జట్టుపై జమ్మూకశ్మీర్ పైచేయి సాధించింది. 67 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత దేశవాళీ క్రికెట్‌లో జమ్మూకశ్మీర్ ఈ ప్రతిష్ఠాత్మక టైటిల్‌ను సొంతం చేసుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో శుభమ్ పుండిర్ సెంచరీతో రాణించడంతో జమ్మూకశ్మీర్ 584 పరుగుల భారీ స్కోరు సాధించింది. బౌలింగ్‌లో ఆకిబ్ నబీ దార్ 5 వికెట్లు పడగొట్టడంతో కర్ణాటక 293 పరుగులకే ఆలౌట్ అయ్యింది. రెండో ఇన్నింగ్స్‌లోనూ జమ్మూకశ్మీర్ బ్యాటర్లు కమ్రాన్ ఇక్బాల్ (160), సాహిల్ లోత్రా సెంచరీలతో చెలరేగారు. జట్టు స్కోరు 342/4 వద్ద ఉన్నప్పుడు కెప్టెన్ పరాస్ డోగ్రా ఇన్నింగ్స్ డిక్లేర్ చేశారు. మ్యాచ్ డ్రాగా ముగిసినప్పటికీ, భారీ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం ఆధారంగా జమ్మూకశ్మీర్ విజేతగా నిలిచింది.

# ఒక్క మాట.. వేల గొంతుల ఓదార్పు



కాంగ్రెస్ ప్రభుత్వ దమననీతిని ఎండగట్టేందుకు ఖమ్మంలోని బాధితుల వద్దకు వెళ్లిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటన యావత్తు తెలంగాణ సమాజాన్ని కదిలించిందని చెప్పడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో గుడిసెలు కూలిపోయి, తినడానికి తిండిలేక, నిత్యావసర వస్తువులు లేక, సొంత రాష్ట్రంలో పరాయి వాళ్లుగా, దొంగలుగా, దోపిడీ దారులుగా, సంఘ విద్రోహులుగా, ప్రభుత్వ భూముల కబ్జా కోరులుగా చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం గుండెల్లో గునపం దించేలా యువనేత కేటీఆర్ చేసిన పర్యటన సాగింది. ఈ పర్యటనకు బాధితులే కాదు అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావడంతోపాటు యువనేతతో కలిసి అడుగులో అడుగేసి బాధితుల పక్షాన నిలబడ్డారు. బాధితుల ఇండ్లన్నీ కూలిపోయి, బుల్డోజర్ల దెబ్బకు యుద్ధభూమిలా మారిన ప్రాంతానికి వెళ్లిన కేటీఆర్‌ను చూసి బాధితులంతా ఆత్మీయంగా కౌగిలించుకుని, కన్నీటి పర్యంతమవుతూ తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఖమ్మం భూదాన్ భూముల్లో ఇండ్లు కోల్పోయిన బాధితుల కష్టాలు కండ్లారా చూసిన తర్వాత వారికి కేటీఆర్ భరోసా ఇచ్చారు. 'ఇదీ కాంగ్రెస్ ప్రభుత్వం అసలు రూపం... మీకు మేమున్నాము.. మీరు ఎక్కడైతే ఇండ్లు కోల్పోయారో అక్కడే ఇండ్లు నిర్మించుకుని గృహప్రవేశాలు చేసేలా మీకు అండగా ఉంటాం.. అవసరమైతే న్యాయస్థానంలో న్యాయపోరాటానికి మీకు తోడుగా ఉంటాం.. అంతేకాదు.. కోర్టు ఖర్చులన్నీ మేమే భరిస్తాం.. మీరు మాత్రం ఇక్కడున్న ముగ్గురు మంత్రుల దొంగ మాటలు, మాయ మాటలు నమ్మొద్దు.. చివరి వరకు మీతో మేముంటాం..' అని వందల మంది కరతాళ ధ్వనుల నడుమ కేటీఆర్ ఇచ్చిన భరోసా బాధితుల కన్నీటి చుక్కలను తుడిచేసింది... వేలగొంతుల భరోసానుకల్పించింది. కర్కశ కాంగ్రెస్ సర్కార్ మూడు రోజులుగా పేదల ఇండ్లు కూల్చివేయడంతో సర్వస్వం కోల్పోయి రోడ్డున పడిన నిరుపేదల గొంతులు కదిలాయి. వారి స్వరం రెట్టింపు అయింది. 'అన్నా మాకు ఇలాంటి భరోసా ఇంతవరకూ ఎవరూ ఇవ్వలేదన్నా...' అంటూ కేటీఆర్‌ను ఆలింగనం చేసుకుని ఆయనలో వారి భవిష్యత్తును చూసుకున్నారు.

పదిహేనేండ్లుగా కూలి పనులు చేసుకుంటూ ఖమ్మంలో కిరాయిలు కట్టలేక.. అయిన కాడికి అప్పులు చేసి ఇండ్లు నిర్మాణం చేసుకున్నారు. కరెంటు, నీళ్ల సౌకర్యం లేకపోయినా.. బతుకు జీవుడా అంటూ పిల్లలను పోషించుకుంటూ వెళ్లదీస్తున్నారు. అలాంటి నిరుపేదల జీవితాలపై బుల్డోజర్లు దింపిన రాష్ట్ర ప్రభుత్వం ఎన్నటికీ చెరిగిపోని తప్పును చేసింది. సరిగ్గా ఐదు రోజుల కిందట అక్కడ నివాసం ఉంటున్న పేదలకు ఇంకా తెల్లవారక ముందే ఆ కాలనీలో కుటుంబాలన్నీ గాఢ నిద్రలో ఉన్న సమయంలో ఉన్నట్టుండి రాకాసి యంత్రాల్లాంటి బుల్డోజర్ల శబ్దం.. వందలాది మంది పోలీసుల బూట్ల చప్పుళ్లతో ఆ ప్రాంతం దద్దరిల్లిందది. ఇండ్లలోని వాళ్లంతా ఉలిక్కిపడి లేచారు. ఒక్కసారిగా బయటకు పరుగెత్తి ఏం జరుగుతున్నదో తెలియక అయోమయానికి గురయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దల సూచన మేరకు ఆ బుల్డోజర్లు క్షణాల్లోనే పేదల ఇండ్లన్నీ కూల్చివేసి వారి బతుకులు రోడ్డున పడేశాయి. 12 ఏండ్లుగా భూదాన్ భూముల్లో నివాసం ఉంటున్న నిరుపేదల నివాసాలను గంటల వ్యవధిలోనే నేలమట్టం చేశాయి. సుమారు 700 ఇండ్లను కూల్చడంతో నీడ కోల్పోయిన బాధిత ప్రజల్లో ఆగ్రహం కట్టలు తెంచుకున్నది. నిరుపేదలు గుండెలు బాదుకుంటూ కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నా.. వారి ఆర్తనాదాలు చెవికెక్కని అధికారులు కూల్చివేతలను ఆపకుండా దమనకాండను కొనసాగించారు. ఆ రాకాసి యంత్రాల భీకర శబ్దాల నడుమ పూట గడవని పేదల గుండెలోతుల్లోంచి పెకిలివస్తున్న ఆర్తనాదాలు ఈ రాక్షస ప్రభుత్వానికి అరణ్య ఘోషగా మారాయి. సర్వం కోల్పోయి కట్టుబట్టలతో రోడ్డున పడ్డ పేదల వద్దకు వచ్చిన కేటీఆర్ నిజంగా బాధితుల్లోనే కాదు, అక్కడున్న వేలాది మంది మనసులు గెలుచుకున్నారు. అప్పటి వరకూ కనీసం తమ బాధలు ఎవరికి చెప్పుకోవాలో, ఎలా చెప్పుకోవాలో తెలియక వారి వద్దకు కనీసం వారి బంధువులను సైతం వెళ్లనీయకుండా దుర్మార్గంగా వ్యవహరించిన ఈ ప్రభుత్వానికి కేటీఆర్ పర్యటన చెంపపెట్టులా మారింది. ఖమ్మం భూదాన భూముల బాధితుల గురించి మాట్లాడటానికి కూడా ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రులు ఇష్టపడలేదు. కానీ కేటీఆర్ పర్యటిస్తుండగానే హుటాహుటిన హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ పెట్టారు. ఖమ్మంలో బాధితులను, బాధితులకు భరోసాగా నిలుస్తున్న వాళ్లను హేళన చేస్తూ మాట్లాడారు. కనీస మానవత్వం లేకుండా బాధితులనే కించపరిచారు. మీడియా ప్రతినిధులు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేదు. ఖమ్మంలో గుడిసెలు కోల్పోయిన బాధితుల ఆక్రందనను, ప్రభుత్వ దమననీతిని బయటి ప్రపంచానికి తెలిసేలా చేసిన కేటీఆర్ పర్యటనలో ఆయన వేసిన ప్రతి అడుగూ కొన్ని వేల అడుగులను కలుపుకుంటూ ముందుకు కదిలింది. నాయకుడంటే ఇలా ఉండాలని అనిపించింది. బాధితుల ముఖాల్లో ఒక నమ్మకాన్ని నింపింది.

నాయకుడంటే పదవిని అడ్డుపెట్టుకుని పది రాళ్లు వెనుకేసుకునేవాడు కాదు... తనను నమ్మిన ప్రజల కోసం ఎంతకైనా వెనుకాడకుండా, వెన్ను చూపకుండా.. 'మీకు నేనున్నాను, మేమందరం ఉన్నాము... మీ కష్టాలు మావి..' అంటూ... బాధితుల్లో భరోసా నింపేవాడు నాయకుడవుతాడు. అలాంటివారే ప్రజల గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోతారు. ఇందిరమ్మ పాలన తెస్తామంటూ గొప్పలు చెప్పుకొనే ముగ్గురు మంత్రులున్న ఖమ్మం జిల్లా నడి మధ్యన, కలెక్టర్ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే సర్కార్ బుల్డోజర్లు నిరుపేదల గుడిసెలను కూల్చాయి. ఐదుగురు జీవుల బతుకులను ఛిద్రం చేసిన

## మాదాపూర్ పోలీస్ సిబ్బందికి ప్రత్యేక ఆరోగ్య పరీక్షలు





**హంస కలం వార్త, తెలుగు దినపత్రిక .. 28 – ఫిబ్రవరి –26:** శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం శ్రమించే మాదాపూర్ పోలీస్ సిబ్బంది తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపారు. మాదాపూర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏషియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ ఆసుపత్రి వారి సౌజన్యంతో సిబ్బందికి ప్రత్యేక ఆరోగ్య పరీక్షా శిబిరాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ నవీన్ రెడ్డి నేతృత్వంలోని వైద్య బృందం ఈ శిబిరంలో పాల్గొని సిబ్బందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య సూత్రాలను వివరించారు. ఈ శిబిరంలో భాగంగా సిబ్బందికి రక్త పరీక్షలు, మూత్ర పరీక్షలు, షుగర్, రక్తపోటు, కిడ్నీ పనితీరును తెలిపే క్రియాటినిన్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారని పేర్కొన్నారు. పరీక్షల అనంతరం కిడ్నీ సంబంధిత వ్యాధుల నివారణపై నిర్వహించిన అవగాహన సదస్సులో డాక్టర్ నవీన్ రెడ్డి మాట్లాడుతూ.. రక్తంలో క్రియాటినిన్, సీరమ్ స్థాయిల ప్రాముఖ్యతను వివరించారు. కిడ్నీల ఆరోగ్యానికి ప్రతిరోజూ తగినంత నీరు త్రాగాలని, ఆహారంలో ఉప్పు వినియోగాన్ని గణనీయంగా తగ్గించాలని సూచించారు.ముఖ్యంగా రక్తంలో చక్కెర స్థాయిలను ఎప్పటికప్పుడు నియంత్రించుకోవాలని, క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా దీర్ఘకాలిక వ్యాధులను దూరం పెట్టవచ్చని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

## నకిలీ వాహన బీమా రాకెట్ ముఠా అరెస్ట్




**హంస కలం వార్త, తెలుగు దినపత్రిక .. 28 – ఫిబ్రవరి –26:** నకిలీ వాహన బీమా పాలసీలు తయారు చేసి ప్రజలను మోసం చేస్తున్న ముఠాను అరెస్టు చేశామని జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ తెలిపారు. ఈ కేసులో మొత్తం తొమ్మిది మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే.. రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధి మృణాల్ కుమార్ ఫిర్యాదు మేరకు, జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎన్‌ఎల్‌బి నగర్, పరిసర ప్రాంతాల్లో కొందరు వ్యక్తులు ప్రముఖ బీమా సంస్థల పేర్లతో నకిలీ వాహన బీమా పత్రాలను తయారు చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఈ మేరకు ఫిర్యాదు ఆధారంగా జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ సమాచారం ఆధారంగా ప్రత్యేక బృందంతో ఈ నెల 27వ తేదీన ఎన్‌ఎల్‌బి నగర్‌లో దాడులు నిర్వహించి రఘుల రవి, శివ కుమార్, ఎస్. కుర్తి మాణిక్యరావు, కొత్త బాబు రావు, రఘుల మహేష్, తదాకల గిరిధర్ గౌడ్, మోర నరసింహ, కుందుంగారి నాగరాజు, జెర్పుల కిషన్‌లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి భారీగా నకిలీ వాహన బీమా పత్రాలు, స్టాంపులు, వాటి తయారీకి ఉపయోగించే పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అత్యవసరంగా బీమా రెన్యువల్ అవసరమైన వాహనదారులను లక్ష్యంగా చేసుకుని ఈ ముఠా వ్యవస్థీకృతంగా పనిచేస్తున్నట్లు విచారణలో వెల్లడైందన్నారు. ఈ ముఠా తో సంబంధం అన్న ఇతరులను కూడా విచారించి అరెస్ట్ చేస్తామన్నారు. ఈ నకిలీ పాలసీల వల్ల ప్రజలు మోసపోవడమే కాకుండా ప్రమాదాల సమయంలో చట్టపరమైన, ఆర్థిక సమస్యలు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. వాహన బీమా తీసుకునే ముందు అధికారిక వెబ్‌సైట్లు లేదా కంపెనీ ఏజెంట్ల ద్వారా ధృవీకరణ చేసుకోవాలని ప్రజలకు సూచించారు.

## బాలానగర్ పోలీస్ సిబ్బందికి బీమా, పొదుపు మార్గాలపై అవగాహన సదస్సు






**హంస కలం వార్త, తెలుగు దినపత్రిక .. 28 – ఫిబ్రవరి –26:** నిరంతరం విధుల్లో ఉంటూ ప్రజల రక్షణ కోసం పాటుపడే పోలీసుల సామాజిక భద్రతే ధ్యేయంగా బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శనివారం సీఐ నర్సింహా రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో పోలీస్ సిబ్బందికి పర్సనల్ లైఫ్, యాక్సిడెంటల్, మెడికల్ ఇన్సూరెన్స్‌తో పాటు పొదుపు మార్గాలపై ఆర్థిక సలహాదారు రమేష్ బోయ్య సమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రమేష్ బోయ్య, వ్యక్తిగత ఆర్థిక ప్రణాళికలో జీవిత బీమా పోషించే కీలక పాత్రను వివరించారు. కుటుంబ బాధ్యతలు, ఆదాయం, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా సరైన ఇన్సూరెన్స్ ప్లాన్‌ను ఎలా ఎంచుకోవాలో సిబ్బందికి వివరించారు. తక్కువ ప్రీమియంతో ఎక్కువ కవరేజ్ లభించే టర్మ్ ప్లాన్ల గురించి, క్లెయిమ్ ప్రక్రియలు, పన్ను ప్రయోజనాల (ఋఇఊ దీవఅవటఊం) గురించి ప్రత్యేకంగా చర్చించారు. అనంతరం సీఐ నర్సింహా రాజు మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎదురయ్యే ప్రమాదాలు లేదా అనారోగ్య సమస్యల సమయంలో బీమా పాలసీలు కుటుంబానికి కొండంత అండగా నిలుస్తాయని సీఐ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వినోద్ కుమార్, ఏఎస్ఐ హనుమయ్య, కానిస్టేబుళ్లు, ఇతర పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తమ సందేహాలను నిపుణులతో చర్చించి నివృత్తి చేసుకున్నారు.

## నకిలీ వాహన బీమా రాకెట్ ముఠా అరెస్ట్



**హంస కలం వార్త తెలుగు దినపత్రిక .. 28 – ఫిబ్రవరి –26:** నకిలీ వాహన బీమా పాలసీలు తయారు చేసి ప్రజలను మోసం చేస్తున్న ముఠాను అరెస్టు చేశామని జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ తెలిపారు. ఈ కేసులో మొత్తం తొమ్మిది మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే.. రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధి మృణాల్ కుమార్ ఫిర్యాదు మేరకు, జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎన్‌ఎల్‌బి నగర్, పరిసర ప్రాంతాల్లో కొందరు వ్యక్తులు ప్రముఖ బీమా సంస్థల పేర్లతో నకిలీ వాహన బీమా పత్రాలను తయారు చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఈ మేరకు ఫిర్యాదు ఆధారంగా జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ సమాచారం ఆధారంగా ప్రత్యేక బృందంతో ఈ నెల 27వ తేదీన ఎన్‌ఎల్‌బి నగర్‌లో దాడులు నిర్వహించి రఘుల రవి, శివ కుమార్, ఎస్. కుర్తి మాణిక్యరావు, కొత్త బాబు రావు, రఘుల మహేష్, తదాకల గిరిధర్ గౌడ్, మోర నరసింహ, కుందుంగారి నాగరాజు, జెర్పుల కిషన్‌లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి భారీగా నకిలీ వాహన బీమా పత్రాలు, స్టాంపులు, వాటి తయారీకి ఉపయోగించే పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అత్యవసరంగా బీమా రెన్యువల్ అవసరమైన వాహనదారులను లక్ష్యంగా చేసుకుని ఈ ముఠా వ్యవస్థీకృతంగా పనిచేస్తున్నట్లు విచారణలో వెల్లడైందన్నారు. ఈ ముఠా తో సంబంధం అన్న ఇతరులను కూడా విచారించి అరెస్ట్ చేస్తామన్నారు. ఈ నకిలీ పాలసీల వల్ల ప్రజలు మోసపోవడమే కాకుండా ప్రమాదాల సమయంలో చట్టపరమైన, ఆర్థిక సమస్యలు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. వాహన బీమా తీసుకునే ముందు అధికారిక వెబ్‌సైట్లు లేదా కంపెనీ ఏజెంట్ల ద్వారా ధృవీకరణ చేసుకోవాలని ప్రజలకు సూచించారు.

## సైబరాబాద్ లో పోలీస్ అధికారుల పదవీ విరమణ



**హంస కలం వార్త తెలుగు దినపత్రిక .. 28 – ఫిబ్రవరి –26:** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆడిటోరియంలో శనివారం రోజు జరిగిన కార్యక్రమంలో పదవీ విరమణ పొందిన నలుగురు పోలీసు సిబ్బందిని ఘనంగా సన్మానించారు. సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ రిటైర్ అయిన సిబ్బందికి పెన్షన్ పత్రాలను అందజేసి పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. పదవీ విరమణ చేసిన వారిలో.. చందానగర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్ఐ గణపురం శ్యామ్ ప్రసాద్, గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు చెందిన ఏఎస్ఐ కె. నాగేశ్వర్ రెడ్డి, గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఏఎస్ఐ కొండా సత్యనారాయణ గౌడ్, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌కు చెందిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ చిత్రా సత్యనారాయణ ఉన్నారు. పదవీ విరమణ పొందిన అధికారుల కుటుంబ సభ్యులు, సహచరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సైబరాబాద్ సీపీ మాట్లాడుతూ.. పోలీస్ శాఖలో నిస్వార్థ సేవలు అందించి పదవీ విరమణ పొందుతున్న అధికారుల అనుభవాలను పంచుకోవడం సంతోషంగా ఉందన్నారు. విధి నిర్వహణలో పోలీసులు చేసే త్యాగాల వెనుక వారి కుటుంబ సభ్యుల పాత్ర వెలకట్టలేనిదన్నారు. భవిష్యత్తులో పోలీస్ శాఖకు అవసరమైనప్పుడు రిటైర్డ్ ఉద్యోగులు వారి సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ, అడ్మిన్ ఏడీసీపీ ఎఫ్. రెహ్మాన్, సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ ఏడీసీపీ షమీర్, సీఏఓ అకౌంట్స్ వెంకట్ రెడ్డి, ఏఓ అడ్మిన్ జ్యోతిర్మణి, ఎస్టేట్ ఆఫీసర్ ఆర్ఐ హిమకర్, సైబరాబాద్ పోలీస్ సహకార సంఘం ఇన్ చార్జ్ జి. మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**




**ఫిబ్రవరి 28 (హంస కలంన్యూస్):** విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి తరగతి గదులు, వంటశాల, విద్యా బోధన తీరు, పరిసరాల పరిశుభ్రత, పాఠశాలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్య దృష్ట్యా ప్రభుత్వం మెనూ ప్రవేశపెట్టి అమలు చేస్తుందని, విద్యారంగ అభివృద్ధి దిశగా తీసుకుంటున్న చర్యలలో భాగంగా నిష్ణాతులైన ఉపాధ్యాయులను నియమించి విద్యా బోధన అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు అందించే భోజనం తయారీ సమయంలో సిబ్బంది శుభ్రత నిబంధనలు పాటించాలని, తాజా కూరగాయలు, నిత్యావసర సరుకులను వినియోగించాలని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. 10వ తరగతి వార్షిక పరీక్షల సమీపిస్తున్నందున విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలని, సులభంగా జీర్ణమయ్యే ఆహారం అందించాలని తెలిపారు. పాఠశాలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థినులు తయారుచేసిన మట్టి ఆకృతులను పరిశీలించారు.అనంతరం మండలంలోని దాంపూర్ గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా ఎంపికైన లబ్ధిదారులు తమ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, నిబంధనల ప్రకారం నిర్ణీత విస్తీర్ణంలో ఇల్లు నిర్మించుకోవాలని తెలిపారు. ఇంటి నిర్మాణ దశలకు అనుగుణంగా బిల్లులు మంజూరు చేయడం జరుగుతుందని, లబ్ధిదారులు తమ ఇండ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొరకు ప్రభుత్వం ఉచితంగా ఇసుక అందిస్తుందని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సైబరాబాద్‌లో సైబర్ మోసగాళ్ల వేట: 8 కేసులు ఛేదన.. 11 మంది అరెస్ట్

**హంస కలం వార్త, తెలుగు దినపత్రిక .. 28 – ఫిబ్రవరి –26:** సైబర్ నేరగాళ్ల పట్ల రాజీలేని పోరాటం కొనసాగిస్తున్నామని, గత వారం రోజుల్లోనే 8 కీలక కేసులను ఛేదించి దేశంలోని పలు రాష్ట్రాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న 11 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు సైబరాబాద్ సైబర్ క్రైమ్స్ డీసీపీ సాయి మనోహర్ వెల్లడించారు. ఫిబ్రవరి 20 నుండి 26 వరకు జరిపిన ప్రత్యేక ఆపరేషన్‌లో భాగంగా 9 మందిని ట్రేడింగ్ మోసాలకు, మరో ఇద్దరిని లోన్ మోసాలకు సంబంధించి అదుపులోకి తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. బాధితులకు ఉపశమనం కలిగించేలా 117 కేసుల్లో మొత్తం 564 రిఫండ్ ఆర్డర్లు పొందామని, తద్వారా సుమారు రూ. 1,62,34,413 మొత్తాన్ని బాధితులకు తిరిగి చెల్లించే ప్రక్రియ కొనసాగుతోందని వివరించారు. ముఖ్యంగా మహారాష్ట్రలోని పుణే నగరంలో అర్జున్ కుమార్ శర్మ అనే నిందితుడిని అరెస్ట్ చేయడం ద్వారా రూ. 1.16 కోట్ల భారీ ట్రేడింగ్ మోసాన్ని ఛేదించామని డీసీపీ తెలిపారు. నిందితులు "మోనార్క్ నెట్‌వర్త్ క్యాపిటల్" సంస్థతో సంబంధం ఉన్నట్లు తప్పుడు ప్రచారం చేస్తూ, "మోనార్క్ ఫైనాన్స్" పేరుతో ఒక నకిలీ యాప్‌ను సృష్టించారు. బాధితులను ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఆకర్షించి, 300 శాతం లాభాల హామీతో పెట్టుబడులు పెట్టించి అపహరించినట్లు గుర్తించారు. నిందితుడు అర్జున్ కుమార్ శర్మ కమీషన్ కోసం కరెంట్ బ్యాంక్ ఖాతాలను తెరిచి, వాటి పూర్తి యాక్సెస్‌ను సైబర్ మోసగాళ్లకు అప్పగించినట్లు విచారణలో వెల్లడైందని ఆయన పేర్కొన్నారు. నేరగాళ్ల వ్యూహం గురించి వివరిస్తూ.. వీరు సోషల్ మీడియాలో ప్రముఖ ఆర్థిక సంస్థల పేరుతో తప్పుడు ప్రకటనలు ఇచ్చి బాధితులను వాట్సాప్ గ్రూపుల్లో చేరుస్తారని డీసీపీ హెచ్చరించారు. అప్పర్ సర్క్యూట్ ట్రేడ్లు, ఐపీఓ కేటాయింపుల పేరుతో నకిలీ స్క్రీన్‌షాట్లు చూపిస్తూ నమ్మకం కలిగిస్తారు. మొదట చిన్న మొత్తాలను ఉపసంహరించుకునేలా చేసి విశ్వాసం పెంచుతారని, ఆపై పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టాక కమిషన్ లేదా ప్రాసెసింగ్ ఫీజుల పేరుతో అదనపు డబ్బు డిమాండ్ చేస్తూ బాధితుల ఖాతాలను బ్లాక్ చేస్తారని వివరించారు. మోసపోయిన నిధులన్నీ వివిధ మ్యూల్ బ్యాంక్ ఖాతాల ద్వారా మళ్లిస్తున్నట్లు తమ పరిశోధనలో తేలిందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలకు పలు సూచనలు చేస్తూ.. అధిక లాభాల హామీ ఇచ్చే సోషల్ మీడియా ప్రకటనలు, వాట్సాప్ గ్రూపులను నమ్మవద్దని డీసీపీ కోరారు. ఏదైనా సంస్థలో పెట్టుబడి పెట్టే ముందు అది సెబీలో రిజిస్ట్రేషన్ పొందిందో లేదో ఖచ్చితంగా నిర్ధారించుకోవాలని సూచించారు. వ్యక్తిగత లేదా తెలియని కరెంట్ ఖాతాలకు డబ్బులు బదిలీ చేయవద్దని, లాభాల ఉపసంహరణ కోసం ఎప్పుడూ ముందుగా డబ్బు చెల్లించవద్దని హెచ్చరించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైనట్లు గుర్తిస్తే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయాలని లేదా www.cyber-crime.gov.in పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని స్పష్టం చేశారు.

### ఉద్యమి సభ్యత్వల ద్వారా ప్రజలని జనసేన పార్టీ లోకి ఆహ్వానిద్దాం,తెలంగాణలో పార్టీని బలోపేతం చేదాం : ప్రేమ కుమార్





**హంస కలం వార్త, తెలుగు దినపత్రిక .. 28 – ఫిబ్రవరి –26:** కె పి హెచ్ బి. 5 వ ఫేస్ తెలంగాణ జనసేన పార్టీ కార్యాలయంలో మహబూబ్ నగర్ పార్లమెంట్ మరియు సైబరాబాద్ కార్పోరేషన్ ఇంచార్జ్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ ఇటీవల జరిగిన మహబూబ్నగర్ జిల్లా, మక్తల్ నారాయణపేట మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులను , అభ్యర్థుల కోసం అహర్నిశలు కష్టపడి పనిచేసిన మహబూబ్నగర్ జిల్లా అడక్ కమిటీ వారిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ ఇతర పార్టీల ప్రలోభాలకు లొంగకుండా ఎవరు ఎంతగా అవమానించిన ధైర్యంగా పోటీ చేయడమే గొప్ప విషయం అని అన్నారు. భవిష్యత్తులో జరిగే ఎలక్షన్స్ కి ఇది ఒక స్ఫూర్తిదాయకమని ఇది ఒక ఆరంభం మాత్రమే అని తెలిపారు.ఇకపై అభ్యర్థులందరూ పార్టీ కోసం పవన్ కళ్యాణ్ ఆశయాలు,సిద్ధాంతాల కోసం వారి యొక్క నియోజకవర్గాల్లో బలంగా పని చేయాలని పిలుపునిచ్చారు. పవన్ కళ్యాణ్ ప్రారంభించిన జనసేన పార్టీ క్రియాశీలక ఉద్యమి సభ్యత్వాలు ప్రతి ఒక్కరితో చేయించాలని ముఖ్యంగా పేద కుటుంబాలతో ఈ యొక్క సభ్యత్వము కచ్చితంగా చేయించాలని, పార్టీ నుంచి వచ్చే ఇన్సూరెన్స్ భవిష్యత్తులో వారికి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అడక్ సభ్యులు పి ఆర్ రాఘవేందర్,శ్రీవల్లి, భరద్వాజ్ ,సాయి జయంత్, దినేష్,కొల్లా శంకర్, వేముల మహేష్, భోగాది వెంకటేశ్వర రావు, మండలి అనిల్, రణదీప్ , జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు

### నేతాజీ నగర్ కాలనీలో హెయిర్ ఆర్ట్ ప్రొఫెషనల్ సెలూన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బేరి రామచందర్ యాదవ్




**హంస కలం వార్త, తెలుగు దినపత్రిక .. 28 – ఫిబ్రవరి –26:** నేతాజీ నగర్ కాలనీలో కిరణ్ బ్రదర్స్ స్థాపించిన హెయిర్ ఆర్ట్ ప్రొఫెషనల్ సెలూన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన బీసీ కులాల ఐక్యవేదిక అధ్యక్షుడు బేరి రామచందర్ యాదవ్. ఈ సెలూన్ ప్రారంభించిన అనంతరం భేరి రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ కిరణ్ బ్రదర్స్ స్థాపించిన ఈ సెలూన్ దినదిన అభివృద్ధి చెందాలని వారు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. స్వయం శక్తితో ఎదగాలని కిరణ్ బ్రదర్స్ తీసుకున్న ఈ నిర్ణయం చాలా గొప్పదని అన్నారు. అలాగే యువత తన స్వయం సంకల్పంతో తమ సొంత ఆలోచనలతో చెడు మార్గాలకు వెళ్లకుండా సమాజానికి మేలు చేసే విధంగా ఉండాలని కులవృత్తులను విస్మరించకుండా మొహమాట పడకుండా వ్యాపారాలు చేసుకోవాలని అన్నారు. కష్టపడి పనిచేసి సంపాదించిన ప్రతి రూపాయి కూడా మనిషిని సంతృప్తిగా ఉంచుతుందని అన్నారు. అడ్డగోలుగా సంపాదిస్తే ఆగమాగం చేస్తాయని అన్నారు. యువతకు ఒక లక్ష్యం ఉండాలని దానికనుగుణంగా ముందుకు సాగాలని అన్నారు. స్వయంకృషితో ఎదగాలనుకున్న కిరణ్ బ్రదర్స్ ను ఈ సందర్భంగా అభినందించారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న రాగం దయాకర్ యాదవ్, అందెల కుమార్ యాదవ్, మరియు కాలనీ పెద్దలు యువజన నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## "విద్యార్థినుల్లో భద్రత జాగృతికి భరోసా సెంటర్ చైతన్య కార్యక్రమం"







**ఫిబ్రవరి 28 (హంస కలంన్యూస్):** జోగులాంబ గద్వాల్ జిల్లా,గట్టు మండల పోలీస్ స్టేషన్ ఎస్సై శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో, గట్టు గ్రామంలోని కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయం, మనోపాడు గురుకుల, గట్టు గురుకుల పాఠశాల మరియు కళాశాలలో పదవ తరగతి, ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థినుల భద్రత, మహిళా రక్షణ, డిజిటల్ చైతన్యం వంటి కీలక అంశాలపై స్పష్టమైన అవగాహన కల్పించారు. మహిళలు, పిల్లలు ఎదుర్కొనే శారీరక, మానసిక, ఆన్‌లైన్ ప్రమాదాలపై వివరించి, భరోసా సెంటర్ అందించే చట్టపరమైన సహాయం, కౌన్సెలింగ్, వైద్య సహాయం, పోలీసు రక్షణ వంటి సేవలను తెలియజేశారు. ఫోక్సో చట్టంలోని ముఖ్యాంశాలను సులభంగా వివరిస్తూ, లైంగిక దుర్వినియోగం మరియు వేధింపులపై కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. "గుడ్ టచ్ -- బ్యాడ్ టచ్" మధ్య తేడాలను ఉదాహరణలతో వివరించి, అనుచిత ప్రవర్తన ఎదురైతే వెంటనే తల్లిదండ్రులు లేదా ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్--100 పోలీస్ హెల్ప్‌లైన్, 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్లను వినియోగించాలని విద్యార్థులకు గుర్తు చేశారు. సైబర్ క్రైమ్‌పై ఎస్సై శేఖర్ గౌడ్ మాట్లాడుతూ సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని, తెలియని వ్యక్తులతో చాటింగ్ చేయడం, వ్యక్తిగత వివరాలు లేదా ఫోటోలు పంచుకోవడం, అనుమానాస్పద లింకులు క్లిక్ చేయడం వలన సైబర్ మోసాలు, హరాస్మెంట్‌కు గురయ్యే ప్రమాదం ఉందని ఎస్సై గారు తెలిపారు. ఓటీపీలు, బ్యాంక్ వివరాలు ఎవరితోనూ పంచుకోకూడదని, ఆన్‌లైన్‌లో మోసపోతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించి, సురక్షిత డిజిటల్ అలవాట్లు అలవరచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శేఖర్ గౌడ్, భరోసా కేంద్రం కోఆర్డినేటర్ శివాని, సపోర్ట్ పర్సన్ స్రవంతి, ప్రిన్సిపాల్ శోభారాణి, వైస్ ప్రిన్సిపల్ అనూష, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

### కల్యాణ లక్ష్మి /షాదిముబారక్ పథకం ద్వారా మంజూరైన 52 మంది లబ్ధిదారులకు 52,06,032/- యాభై రెండు లక్షల ఆరు వేల ముప్పై రెండు రూపాయల ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులకు అందచేసిన ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ





**హంస కలం వార్త, తెలుగు దినపత్రిక .. 28 – ఫిబ్రవరి –26:** కూకట్ పల్లి మండలం పరిధిలోని వివేకానంద నగర్, హైదర్ నగర్, ఆల్విన్ కాలనీ , కూకట్ పల్లి (పార్ట్) డివిజన్ల పరిధిలోని పలువురికి కల్యాణ లక్ష్మి /షాదిముబారక్ పథకం ద్వారా మంజూరైన 52 మంది లబ్ధిదారులకు 52,06,032/- యాభై రెండు లక్షల ఆరు వేల ముప్పై రెండు రూపాయల ఆర్థిక సహాయాన్ని వివేకానంద నగర్ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో తాజా మాజీ కార్పొరేటర్లు నార్నె శ్రీనివాసరావు , ఉప్పలపాటి శ్రీకాంత్ , సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి గార్లు యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ తో కలిసి లబ్ధిదారులకు చెక్కుల రూపేణా అందచేసిన ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ .

డైలీ న్యూస్ పేపర్ హంస కలం

ఆదివారం 01-03-2026

# విడుదలకు ఆ హీరో కొత్త సినిమా.. థియేటర్లలో ఆడియన్స్ చూస్తారా?



ఈ మధ్యకాలంలో కొంతమంది హీరోల ప్రవర్తన.. వారి కెరియర్ పై పడుతోంది అనడంలో సందేహం లేదు. ముఖ్యంగా వీరి సినిమాల సంగతి పక్కన పెడితే.. నిజజీవితంలో వీరు చేస్తున్న పనులు ప్రజలలో వ్యతిరేకతను కలిగిస్తున్నాయి. ఈ క్రమంలోనే గత ఏడాది అభిమానిని హత్య చేసిన కేసులో హీరో దర్శన్ ఇటు ప్రజలు అటు ప్రేక్షకుల నుంచి ఏ రేంజ్ లో వ్యతిరేకత ఎదుర్కొంటున్నారో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇటీవల ఆయన సినిమా విడుదలవగా ఆ సినిమాను థియేటర్లలో ఫ్లాప్ చేసి ఆయనపై ఉన్న వ్యతిరేకతను నిరూపించారు. ఈ సంవత్సరం అత్యంత పేరు తెచ్చుకున్నవాళ్లు వీళ్లే గురూ..! అయితే ఇప్పుడు అలాంటి ఒక హీరో సినిమా థియేటర్లలోకి రాబోతోంది..ఆయన చేసిన పనికి ఇప్పటికే ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరి అలాంటి ఆయన సినిమాను థియేటర్లలో ఆడియన్స్ చూస్తారా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అసలు విషయంలోకి వెళ్తే.. గత ఎనిమిది సంవత్సరాల క్రితం ఒక 10 మంది దుండగులు ఒక మలయాళ హీరోయిన్ పై లైంగిక దాడి చేసిన విషయం అప్పట్లో సంచలనం సృష్టించింది. అయితే ఈ దాడిని ఈరోజు దిలీప్ ప్లాన్ చేశారు అని అప్పట్లో కేసు కూడా ఫైల్ చేశారు. అంతేకాదు మూడు నెలల పాటు జైలు శిక్ష అనుభవించిన దిలీప్ బెయిల్ మీద బయటకు వచ్చారు. కానీ దాదాపు 8 ఏళ్ల పాటు ఈ కేసు విచారణ జరిగింది. అయితే ఇటీవల ఎర్నాకులం ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు.. దిలీపే ఈ దుర్ఘటనను ప్లాన్ చేశాడు అనడానికి సరైన ఆధారాలు లేవు అని నిర్దోషిగా భావిస్తూ క్లీన్ చిట్ ఇచ్చింది. ఆదర్శ కుటుంబం దసరాకే ఫిక్స్..? అలాగే మరో ముగ్గురిని కూడా నిర్దోషులుగా భావించిన కోర్టు వారిని విడుదల చేసింది..ఇక మిగిలిన ఆరుగురికి 20 సంవత్సరాల కారాగార కఠిన శిక్ష విధించిన విషయం తెలిసిందే. ఇకపోతే కోర్టు దిలీప్ ని నిర్దోషిగా విడుదల చేసినప్పటికీ.. ప్రజలు మాత్రం ఈయనను నిర్దోషిగా భావించడం లేదు. దీనికి తోడు పలువురు సెలబ్రిటీలు, దిలీప్ మాజీ భార్య మంజు, అలాగే కొంతమంది హీరోలు కూడా కోర్టు తీర్పు పై అసహనం వ్యక్తం చేస్తున్నారు.. దీనికి తోడు ఇటీవల కేరళ ఆర్టీసీ బస్సులో దిలీప్ సినిమాలలో ఒక సినిమాను ప్రదర్శించగా.. మహిళలు వెంటనే ఆపివేయాలని డిమాండ్ చేశారు. కండక్టర్ చేసేదేమీ లేక సినిమా మార్చేశారు వీళ్లు మనుషులా లేక జంతువులా? అలా ప్రజలలో హీరో దిలీప్ పై నెగిటివిటీ పెరిగిపోతున్న నేపథ్యంలో తాజాగా ఈయన నటించిన భభబ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. అసలే ఆ హీరోయిన్ కేసులో ఈయనపై పూర్తిస్థాయిలో నెగెటివిటీ పెరిగిపోయింది. ఇలాంటి సమయంలో ఈయన నటిస్తున్న సినిమా ఇప్పుడు థియేటర్లలోకి వస్తుండగా.. అసలు ఈ సినిమాను ఆడియన్స్ చూస్తారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి తోడు ఈ సినిమాలో కొంతమంది బడా హీరోలు నటిస్తుండడంతో దిలీప్ కారణంగా ఆ హీరోలపై కూడా ప్రజలలో వ్యతిరేకత ఏర్పడింది. ఏది ఏమైనా ఈ సినిమాను అసలు ప్రేక్షకులు ఆదరిస్తారా? ఈ సినిమాను సక్సెస్ చేస్తారా అని అనుమానాలను నెటిజెన్స్ వ్యక్తపరుస్తున్నారు. మరి ఈ సినిమా ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో చూడాలి.

**అలా ప్రజలలో హీరో దిలీప్ పై నెగిటివిటీ పెరిగిపోతున్న నేపథ్యంలో తాజాగా ఈయన నటించిన భభబ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. అసలే ఆ హీరోయిన్ కేసులో ఈయనపై పూర్తిస్థాయిలో నెగెటివిటీ పెరిగిపోయింది.**

# రెండో పెళ్లి తర్వాత కొత్త ప్లాన్స్ వేసుకున్న సమంత..!

తాజాగా ఆమె సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ ఇప్పుడు అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది.




గత కొద్ది సంవత్సరాలుగా సమంత ఆరోగ్య పరంగా.. పర్సనల్ లైఫ్ పరంగా సమస్యలు ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. మరో పక్క దర్శకుడు రాజ్‌తో ప్రేమలో ఉన్నట్టు ఎన్నో వార్తలు వచ్చాయి. ఇక వాటన్నిటికీ నిజం చేస్తూ.. సమంత ఈ నెల మొదట్లో అతన్ని పెళ్లి చేసుకుంది. ఈ క్రమంలో పెళ్లి తర్వాత.. సమంత రూత్ ప్రభు 2026 సంవత్సరాన్ని కొత్త ఆలోచనలతో.. ప్రశాంతమైన మనసుతో ఆహ్వానించడానికి సిద్ధమయ్యారు అని తెలుస్తోంది. తాజాగా ఆమె సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ ఇప్పుడు అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఆ పోస్ట్‌లో ఆమె 2026కి పెట్టుకున్న లక్ష్యాలు చాలా సింపుల్‌గా.. మోటివేషనల్‌గా.. ఉండటంతో.. చాలామందికి ప్రేరణగా మారాయి. మెగా కొణిదెల ప్రొడక్షన్స్ ఏమైంది..? పెళ్లయిన తర్వాత సమంత జీవితాన్ని కొంచెం నెమ్మదిగా.. ఆలోచించి జీవించాలని అనుకుంటున్నట్లు కనిపిస్తోంది. ఎప్పటికప్పుడు విజయాల వెంట పరుగులు తీయడం కంటే.. తనకు నిజంగా అవసరమైన విషయాలపై దృష్టి పెట్టాలని ఆమె నిర్ణయించుకున్నారు. 2026 కోసం ఆమె పెట్టుకున్న లక్ష్యాలు ఏమిటంటే.. దీర్ఘకాలం ఆరోగ్యంగా ఉండటం.. రోజూ వ్యాయామం చేయడం.. పక్కన వారితో కృతజ్ఞతతో జీవించడం.. మంచి సంబంధాలు పెట్టుకోవడం.. సమాజానికి ఏదో ఒక రూపంలో తిరిగి ఇవ్వడం.. తన అంతర్గత భావనను నమ్మడం.. స్థిరమైన పని.. స్థిరమైన అభివృద్ధి పొందడం. ఇవే లక్ష్యాలుగా పేర్కొంది సమంత. కామెడీ సీక్వెల్స్‌కి 2025 బిగ్ షాక్! ఈ లక్ష్యాలు చూస్తే.. సమంత కేవలం నటి గానే కాకుండా.. ఒక వ్యక్తిగా కూడా ఎదగాలని కోరుకుంటూ ఉందని అర్థమవుతుంది. పేరు, డబ్బు, హడావుడి కంటే మనశ్శాంతి సమతుల్యత ముఖ్యమని ఆమె నమ్ముతున్నట్లు ఈ పోస్టులో పక్కా చెబుతోంది. ఈ పోస్ట్‌తో పాటు ఆమె ప్రశాంతంగా నవ్వుతూ ఉన్న ఒక సాదా ఫోటోను కూడా షేర్ చేశారు. ఆ ఫోటో ఆమె మాటలకు అచ్చంగా సరిపోతుందని.. అభిమానులు కామెంట్లు కూడా పెడుతున్నారు. ఇక ఈ మధ్యనే కోయంబత్తూరులోని ఇషా యోగా సెంటర్‌లో కుటుంబ సభ్యులు, సన్నిహితుల మధ్య చాలా సింపుల్‌గా ఆమె పెళ్లి జరిగింది. తర్వాత సోషల్ మీడియాలో కేవలం తేదీతో పెళ్లి ఫోటోలను షేర్ చేసింది. పెళ్లి తర్వాత ముంబైలో.. మొదటిసారి ఈ జంట.. ఫోటోగ్రాఫర్లకు నవ్వుతూ థాంక్స్ చెప్పిన.. ఫోటోలు వైరల్ అయ్యాయి. సినిమాల విషయానికి వస్తే సమంత ప్రస్తుతం మా ఇంటి బంగారం సినిమా షూటింగ్‌తో బిజీగా ఉంది.

# భారతదేశంలో అత్యంత ధనికురాలైన నటి?




బాలీవుడ్‌తో పాటు తెలుగు, తమిళ పరిశ్రమల్లోను జూహీ చావ్లా సుపరిచితురాలు. అక్కినేని నాగార్జున సరసన విక్కీ దాదా చిత్రంలో జూహీ నటించారు. హిందీ చిత్రసీమలో పలు బ్లాక్ బస్టర్ సినిమాల్లో నటించిన జూహీ నిర్మాతగా పలు సినిమాలను కూడా నిర్మించారు. అలాగే ఐపీఎల్ లోను జూహీ పెట్టుబడులు ఎల్లప్పుడూ చర్చనీయాంశంగా ఉన్నాయి. కోల్ కతా నైట్ రైడర్స్ జట్టుపై షారూఖ్‌తో కలిసి జూహీ పెట్టుబడులను పెట్టారు. ఈ పెట్టుబడులు జూహీ చావ్లా, ఆమె భర్త జే మెహతాలను రిచెస్ట్ ఇండియన్ సెలబ్రిటీలుగా మార్చాయి. ఈ సంవత్సరం అత్యంత పేరు తెచ్చుకున్నవాళ్లు వీళ్లే గురూ..! హురూన్ ఇండియా సర్వే ప్రకారం.. జూహీ చావ్లా ఆస్తుల విలువ రూ.7,790 కోట్లు. భర్త ఆస్తులతో కలిపి నికర ఆస్తుల విలువ ఇది. అయితే 2024 నాటికి ఈ ఆస్తుల విలువ కేవలం రూ.4600 కోట్లు. 2025 హురూన్ లిస్ట్ ప్రకారం.. ఒక్క ఏడాదిలోనే రూ.3,190కోట్ల సంపదల్ని ఈ జంట అదనంగా జోడించారు. అయితే దీనివెనక జూహీ, ఆమె భర్త వ్యాపార నైపుణ్యం సర్వత్రా ఆసక్తిని కలిగిస్తోంది. సీనియర్ నటి జూహీ చావ్లా దేశంలోనే అత్యంత సంపన్న నటిగా ఏళ్లతరబడి తన స్థానాన్ని నిలబెట్టుకుంటున్నారు. ఆమె భర్త, పారిశ్రామికవేత్త జే మెహతా విజయవంతమైన బిజినెస్ మేన్ గా రాణిస్తున్నారు. రకరకాల వ్యాపారాల నుండి ఈ జంట భారీగా ఆర్జిస్తోంది. కోల్‌కతా నైట్ రైడర్స్ ఫ్రాంచైజీకి షారూఖ్ తో మెహతా సహయజమాని. ఖాన్ రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్మెంట్ తోను జూహీ అనుబంధం కలిగి ఉన్నారు. జూహీ చావ్లా- జే మెహతా జంట రియల్ ఎస్టేట్ రంగంలోను సుప్రసిద్ధులు. జూహీ చాలా కాలంగా సినిమాలకు దూరంగా ఉన్నారు. గత 15ఏళ్లలో అసలు సినిమాలే లేవ్. కానీ తన భర్త తో కలిసి లాభసాటి వ్యాపారాల్లో జూహీ తలమునకలుగా ఉన్నారు. దానికి తగ్గట్టే తన ఆదాయం పదింతలు పెరుగుతోంది. రియల్ ఎస్టేట్, ఐపీఎల్ సహా పలు రంగాల్లో పెట్టుబడులు అత్యంత లాభసాటిగా మారడంతో ఆస్తులు అమాంతం పెరుగుతున్నాయని కథనాలొస్తున్నాయి.

# వీళ్లు మనుషులా లేక జంతువులా?

**ఈ ఇన్సిడెంట్ మీద ఇప్పుడు సోషల్ మీడియాలో గట్టిగానే చర్చ జరుగుతోంది. సింగర్ చిన్మయి లాంటి వాళ్ళు దీనిపై సీరియస్ గా రియాక్ట్ అయ్యారు.**

హైదరాబాద్ లులు మాల్‌లో జరిగిన 'ది రాజా సాబ్' సాంగ్ లాంచ్ ఈవెంట్ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అయ్యింది. ఒకపక్క ప్రభాస్ సినిమా నుంచి వచ్చిన 'సహనా సహనా' మెలోడీ సాంగ్, నిర్మాత ఇచ్చిన క్రేజీ అప్డేట్స్ తో ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అయ్యారు. మాల్ మొత్తం ప్రభాస్ నినాదాలతో దద్దరిల్లిపోయింది. ఆ క్రౌడ్ ని, అక్కడి వైబ్ ని చూస్తే సినిమా మీద ఉన్న హైప్ ఏ రేంజ్ లో ఉందో క్లియర్ గా అర్థమైంది. ఇక్కడి వరకు అంతా సూపర్. కానీ ఈవెంట్ అయిపోయాక చివర్లో జరిగిన ఒక సీన్ మాత్రం షాక్ కు గురి చేస్తోంది. ఈవెంట్ లో స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచిన హీరోయిన్ నిధి అగర్వాల్ కు ఊహించని షాక్ తగిలింది. ప్రోగ్రామ్ అయిపోయాక ఆమె బయటకు వెళ్తుంటే జనం ఒక్కసారిగా మీద పడ్డారు. అప్పటి వరకు సైలెంట్ గా ఉన్న క్రౌడ్.. ఆమెను చూడగానే కంట్రోల్ తప్పింది. ఆదర్శ కుటుంబం దసరాకే ఫిక్స్..? సెల్ఫీల కోసం, ఆమెను చూడడం కోసం ఎగబడ్డారు. ఆ తోపులాటలో ఆమె నడవలేక ఇబ్బంది పడటం వీడియోల్లో క్లియర్ గా కనిపిస్తోంది. ఇక కారు ఎక్కాక కూడా జనం వదల్లేదు. అద్దాల మీద పడిపోవడం, కారును చుట్టుముట్టడం చూస్తుంటేనే హారర్ సీన్ ని తలపించింది. ఒక పబ్లిక్ ప్లేస్ లో ఒక స్టార్ హీరోయిన్ కు సేఫ్టీ లేకుండా పోవడం అంటే మామూలు విషయం కాదు. ఈ ఇన్సిడెంట్ మీద ఇప్పుడు సోషల్ మీడియాలో గట్టిగానే చర్చ జరుగుతోంది. సింగర్ చిన్మయి లాంటి వాళ్ళు దీనిపై సీరియస్ గా రియాక్ట్ అయ్యారు. ఆ వీడియోలు చూసి "వీళ్లు మనుషులా లేక జంతువులా?" అంటూ ఘాటుగా ప్రశ్నించారు. నెటిజన్లు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఆ టైమ్ లో నిధి అగర్వాల్ ఎంతగా భయపడిపోయి ఉంటారో, ఎంత మెంటల్ స్ట్రెస్ ఫీల్ అయ్యి ఉంటారో అర్థం చేసుకోవచ్చు. కెమెరా ముందు నవ్వుతూ కనిపించినా, ఇలాంటి చేదు అనుభవాలు వాళ్లను చాలా డిస్టర్బ్ చేస్తాయని నెటిజన్లు అంటున్నారు. స్పిరిట్ షూటింగ్.. రాజా సాబ్ ప్రమోషన్స్..! మరికొందరు మరో విధంగా స్పందిస్తున్నారు. ఇక్కడ ఫస్ట్ బ్లేమ్ చేయాల్సింది ఈవెంట్ ఆర్గనైజర్స్ నే. ప్రభాస్ సినిమా ఈవెంట్ జనం ఏ రేంజ్ లో వస్తారో చిన్న పిల్లాడిని అడిగినా చెప్తాడు. మరి దానికి తగ్గ సెక్యూరిటీ ఏది? మాల్ లాంటి ఓపెన్ ప్లేస్ లో ఈవెంట్ ప్లాన్ చేసినప్పుడు పక్కా ప్లానింగ్ ఉండాలి కదా. కేవలం హైప్ కోసం క్రౌడ్ ని పోగేసి, వచ్చిన గెస్ట్ లకు రక్షణ ఇవ్వలేకపోతే ఎలా? అని ప్రశ్నిస్తున్నారు. బౌన్సర్లు కూడా ఆ జనప్రవాహాన్ని ఆపలేక చాలా కష్టపడ్డారు. నిధి అగర్వాల్ చుట్టూ కనీసం ఒక సేఫ్టీ సర్కిల్ కూడా మెయింటైన్ చేయలేకపోయారు. సెలబ్రిటీలను పిలిచాక వాళ్ళను సేఫ్ గా పంపించాల్సిన బాధ్యత పూర్తిగా మేనేజ్మెంట్ దే. ఇక్కడ వాళ్లు ఘోరంగా ఫెయిల్ అయ్యారని మరికొందరు అంటున్నారు. అయితే ఫ్యాన్స్ బిహేవియర్. అభిమానం ఉండొచ్చు, కానీ అది అవతలి వాళ్లకు నరకం చూపించేలా ఉండకూడదనే కామెంట్స్ కూడా వస్తున్నాయి.



# స్పిరిట్ షూటింగ్.. రాజా సాబ్ ప్రమోషన్స్..!




రెబల్ స్టార్ ప్రభాస్ స్పిరిట్ సెట్స్ మీద ఉంది. సందీప్ వంగ డైరెక్షన్ లో తెరకెక్కుతున్న ఈ సినిమా ఫస్ట్ షెడ్యూల్ రీసెంట్ గా పూర్తైంది. ఐతే సందీప్ వంగ న్యూ ఇయర్ కోసం షూటింగ్ గ్యాప్ ఇద్దామని ముందు అనుకున్నారట. కానీ ప్రభాస్ లుక్ తో పాటు సినిమాలో విలన్ గా నటిస్తున్న వివేక్ ఓబెరాయ్ లుక్ కూడా రివీల్ అవుతుందని ఆ లుక్ తోనే కొన్ని ఇంపార్టెంట్ సీన్స్ షూట్ చేస్తున్నారట. అందుకే న్యూ ఇయర్ కి గ్యాప్ లేకుండా షూటింగ్ చేయాలని ఫిక్స్ అయ్యారట. వీళ్లు మనుషులా లేక జంతువులా? సంక్రాంతి కానుకగా రాజా సాబ్.. స్పిరిట్ షూటింగ్ లో పాల్గొనడానికి ప్రభాస్ అంతా రెడీనే కానీ జనవరిలో సంక్రాంతి కానుకగా రాజా సాబ్ రిలీజ్ అవుతుంది. ఆ సినిమా ప్రమోషన్స్ కి ప్రభాస్ టైం ఇవ్వాల్సి ఉంది. డిసెంబర్ లోనే ప్రభాస్ తన డేట్స్ మొత్తం రాజా సాబ్ ప్రమోషన్స్ కి ఇచ్చేశాడని టాక్. ఈ టైం లో సందీప్ వచ్చి స్పిరిట్ షూటింగ్ చేస్తానంటే కష్టమవుతుంది. స్పిరిట్ కోసం ప్రభాస్ అడ్జెస్ట్ మెంట్ చేస్తున్నాడట. ఓ పక్క స్పిరిట్ షూట్ తో పాటు రాజా సాబ్ ప్రమోషన్స్ కి టైం ఇచ్చేలా అడ్జెస్ట్మెంట్స్ చూస్తున్నారని తెలుస్తుంది. రాజా సాబ్ సినిమాను మారుతి డైరెక్ట్ చేస్తున్నారు. ఈ సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తున్నారు. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్ హీరోయిన్స్ గా నటిస్తున్న ఈ సినిమాకు థమన్ మ్యూజిక్ అందిస్తున్నారు. విడుదలకు ఆ హీరో కొత్త సినిమా.. థియేటర్లలో ఆడియన్స్ చూస్తారా? ఫ్యాన్స్ చాలా ఆసక్తిగా.. ప్రభాస్ రాజా సాబ్ సినిమా విషయంలో రెబల్ ఫ్యాన్స్ సూపర్ ఎగ్జైటెడ్ గా ఉన్నారు. ఐతే స్పిరిట్ సినిమా కోసం రెబల్ ఫ్యాన్స్ చాలా ఆసక్తి చూపిస్తున్నారు. ఎందుకంటే యానిమల్ డైరెక్టర్ ప్రభాస్ తో ఎలాంటి సినిమా చేస్తాడా అన్న ఇంట్రెస్ట్ ఉంటుంది. స్పిరిట్ లో ప్రభాస్ ఒక పవర్ ఫుల్ పోలీస్ రోల్ లో కనిపించనున్నారు. ఈ సినిమాలో త్రిప్తి డిమ్రి హీరోయిన్ గా నటిస్తుంది. సో డిసెంబర్ ఎండింగ్ లో ప్రభాస్ స్పిరిట్ షూటింగ్ తో పాటు.. రాజా సాబ్ ప్రమోషన్స్ ని కూడా ప్లాన్ చేస్తున్నారన్నమాట. సో రెండు సినిమాలకు తన రెస్పాన్సిబిలిటీస్ చూస్తున్నాడు ప్రభాస్. ఇక ప్రభాస్ లైన్ లో ఉన్న సినిమాల గురించి చూస్తే నెక్స్ట్ ఇయర్ రాజా సాబ్, ఫౌజీ రిలీజ్ ప్లాన్ ఉండగా స్పిరిట్ ని 2027 రిలీజ్ ప్లాన్ చేస్తున్నారు. ఐతే నెక్స్ట్ ఇయర్ ఎలాగైనా కల్కి 2ని సెట్స్ మీదకు తీసుకెళ్లేలా మేకర్స్ రెడీ అవుతున్నారు. ప్రభాస్ డేట్స్ ఇస్తే కల్కి 2 పూర్తి చేసి 2028 రిలీజ్ చేసేలా ప్లానింగ్ ఉందట. ఈమధ్యలోనే సలార్ 2 కూడా ప్రభాస్ చేయాల్సి ఉంది.